ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
గురువారం 5 సెప్టెంబరు 2024



నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 4: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నామని డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 28 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, 16 మంది ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశామన్నారు. వీరిందనీ గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో సన్మానిస్తున్నామన్నారు.

ఎటు చూసినా నీరు.. ఎలా నిర్మించారు..

- సైదాపూర్ మోడల్ స్కూల్‌కు ప్రతీ వర్షాకాలంలో ఇబ్బందులు
- సమస్యను పరిష్కరించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



చుట్టూ నీరు చేరి జలమయమైన మోడల్ స్కూల్

సైదాపూర్, సెప్టెంబరు 4: మండలంలోని కురిసిన వర్షానికి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సోమారం శివారులోని మోడల్ స్కూల్ పూర్తిగా జలమయమయింది. స్కూల్ చుట్టూ వరద నీరు చేరింది. దీంతో విద్యార్థులకు బుధవారం సెలవు ప్రకటించారు. ఈ స్కూల్‌ను మూడు వాగులు కలిసే చోట, లోతట్టు ప్రాంతంలో నిర్మించారు. వర్షాలు కురిసినప్పుడల్లా ఇదే పరిస్థితి. స్కూల్ చుట్టూ ప్రహరీ కూడా లేకపోవడంతో స్కూల్ చుట్టూ వరద చేరుతోంది. గతంలో ఓ కాంట్రాక్టర్ ప్రహరీ పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. ప్రతీ వర్షాకాలంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాలుగు రోజులైనా.. పట్టించుకోరా..

- కుంగిన లోలెవల్ వంతెన
- ఇబ్బందుల్లో ఆరు గ్రామాల ప్రజలు

మానకొండూర్, సెప్టెంబరు 4: మండలంలో కురిసిన భారీ వర్షాలకు లింగాపూర్-వెల్ది గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెన కుంగిపోయింది. దీంతో నాలుగు రోజులుగా ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఈదులగట్టెపల్లి, అన్నారం, రంగపేట మీదుగా లింగాపూర్-వెల్ది రోడ్డుడ్యాం నుంచి మానేరు వాగులోకి నీరు ప్రవహిస్తుంది. పై నుంచి వచ్చే వరద ప్రవాహం ఎక్కువ కావడంతో లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహించి రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన దెబ్బతిన్నది. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సును నిలిపివేశారు. కరీంనగర్‌కు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



లింగాపూర్-వెల్ది గ్రామాల మధ్య కుంగిన లోలెవల్ వంతెన

రాజకీయాల్లోకి 'అల్ఫోర్స్' నరేందర్‌రెడ్డి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై గురి
- కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసేందుకు ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో రాజకీయ ఆరంగేట్రం చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలోనే ఆయన రాజకీయాల్లోకి వస్తున్నారని విస్తృతంగా ప్రచారం జరిగింది. రెండు రాజకీయ పక్షాలు కూడా ఆయనను పార్టీలో చేర్చుకొని పోటీ చేసే అవకాశం కల్పించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినా ఆయన రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకొని సున్నితంగా తిరస్కరించారు. ఆయన ప్రస్తుతం రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకోవడం చర్చనీయాంశంగా మారింది. కుటుంబసభ్యులు, సన్నిహితులతో చర్చించి ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. విద్యావేత్తగా, విద్యాసంస్థల అధిపతిగా పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పెద్దల సభకు పోటీ చేయడం సముచితంగా ఉంటుందని భావించడంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం.

మద్దతు కోసం ప్రయత్నాలు



నరేందర్‌రెడ్డి ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు, పార్టీ నేతలను కలుసుకొని వారి మద్దతు కోరారని సమాచారం. ప్రస్తుతం కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి టి జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ప్రాతి నిధ్యం వహిస్తున్నారు. నరేందర్‌రెడ్డి రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్న తర్వాత ముందుగా జీవన్‌రెడ్డి వద్దకే వెళ్లి కలిసినట్లు తెలిసింది. ఆయన ఈసారి పోటీలో ఉండడానికి ఆసక్తికనబరచక పోవడంతో తనకు ఆశిస్సులు అందించాలని కోరినట్లు సమాచారం. జీవన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకవెళ్తానని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయాలని కోరినట్లు తెలిసింది. జీవన్‌రెడ్డి పోటీలో ఉండడంలేదని ధ్రువపరుచుకున్న నరేందర్‌రెడ్డి మంత్రులు పొన్నం ప్రభాకర్, డి శ్రీధర్‌బాబును కలిసి సహకారం కోరినట్లు సమాచారం. ఒకటిరెండు రోజుల్లో నరేందర్‌రెడ్డి తన రాజకీయ ప్రవేశాన్ని ప్రకటించి, పట్టభద్రుల ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించి ఓటర్ల నమోదుకు శ్రీకారం చుడతారని, అందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిసింది. బీఆర్‌ఎస్ టికెట్ కోసం పలువురు ప్రయత్నిస్తున్నారు.. కాంగ్రెస్ నుంచి ఇప్పటి వరకు వెలిచాల రాజేందర్‌రావు పేరు మాత్రమే వినిపించినా ఆయన దాన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు. దీనితో నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికే మొగ్గు చూపుతున్నారని, అందుకే ఆయన ముందుగా జీవన్‌రెడ్డిని కలిశారని అనుకుంటున్నారు.

గతంలో నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్, బీజేపీలు తమ పార్టీల్లో చేరాలని ఆహ్వానించాయి. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గుచూపుతున్నారు. బీజేపీ నుంచి పలువురు నేతలు టికెట్ ఆశిస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో, బీజేపీలో ఇప్పటికే పోటీ ఎక్కువగా ఉన్నందున రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయాలని నరేందర్‌రెడ్డి నిర్ణయించుకుని ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని సమాచారం.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- సీపీ అభిషేక్ మొహంతి



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి, శాంతి కమిటీ సమావేశానికి హాజరైన సభ్యులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 4: వినాయక నవరాత్రులు, మిలాద్‌ఉన్‌నబీ పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీపీ అభిషేక్ మొహంతి అన్నారు. పోలీస్ కమిషనరేట్‌లోని జాన్‌విల్సన్ హాల్‌లో శాంతి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద పోలీసుల సూచనలు పాటిస్తూ వచ్చే భక్తులకు భద్రత కల్పిస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని మండప నిర్వాహకులకు సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీల్లో సంఘ విద్రోహ శక్తులకు, గతంలో అల్లర్లు సృష్టించిన వ్యక్తులకు చోటు కల్పించకూడదని తెలిపారు. సోషల్ మీడియా వేదికగా వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాటికి స్పందించి ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైనా సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ అధికారులకు తెలపాలని, సమస్య పరిష్కరించి బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా నిర్వహించే ర్యాలీ హైదరాబాద్‌లో నిర్ణయించినట్లు 19న జరుపుకోవాలన్నారు. ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరీంనగర్ ప్రజలంతా ఐక్యమత్యంతో పండగలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ నరేందర్, సీఐలు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 4: వాతావరణ శాఖ ఈ నెల 4 నుంచి 9 వరకు భారీవర్షాలు ఉంటాయని హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ సర్కిల్ సూపర్‌ఇంటెండింగ్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. హెడ్‌క్వార్టర్స్ లోనే ఉంటూ ప్రతి గంటకొకసారి విద్యుత్ సరఫరా స్థితిని పరిశీలించాలన్నారు. 24/7 పనిచేసేటట్లు అన్ని సర్కిల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయాలు, విపత్కర పరిస్థితులు జరిగినవెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తగిన సిబ్బంది, సామగ్రి సిద్ధంగా ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సిబ్బంది సెలవులను రద్దు చేశామని, అత్యవసరంగా సెలవు కావాలంటే సీఈకి (హెచ్‌ఆర్‌డీ, ట్రైనింగ్) సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతికూల వాతావరణం, వరదలు, విద్యుత్ ప్రమాదాలు, ఆస్తి నష్టం లాంటి పరిస్థితులు ఏర్పడిన వెంటనే కార్పొరేట్ ఆఫీస్‌కు తెలియజేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

మట్టి గణపతులను పూజించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 4: పర్యావరణానికి అనుకూలమైన మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని కలెక్టర్ పమేలా సత్పతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి మట్టి గణపతులను పూజించాలని కోరుతూ రూపొందించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహా నీటిలో కరగడానికి సంవత్సరాలు పడుతుందని అన్నారు. మట్టితో తయారు చేసే విగ్రహాలు నీటిలో త్వరగా కరుగుతాయన్నారు. మట్టి గణపతులను వినియోగించే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తామని మండలి ఈఈ భిక్షపతి, ఏఈ సీహెచ్ వీరేష్ తెలిపారు. ప్రతి జిల్లాకు రెండు వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిచేస్తామన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 4: పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి అన్నారు. బుధవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని సప్తగిరికాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పిల్లల బరువు, ఎత్తు చూసి తల్లిదండ్రులకు తెలియజేయాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యురాలు అఖిల మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్ణీత సమయం ప్రకారం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లావణ్య, హెల్త్ సూపర్‌వైజర్ సాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్ హరిప్రియ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి


ఎన్నాళ్లీ బాధలు..

- తీరని నారాయణపూర్ కష్టాలు
- రిజర్వాయర్ నీటితో ఇళ్లలో ఊటలు

గంగాధర, సెప్టెంబరు 4: గంగాధర మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బెల్లం బక్కయ్య దంపతుల ఇల్లు రిజర్వాయర్‌కు సమీపంలో ఉంది. 50 సంవత్సరాల క్రితం వారు ఇళ్లు నిర్మించుకున్నప్పుడు అది మామూలు చెరువు. తరువాత దానిని రిజర్వాయర్‌గా మార్చారు. అందులో నీటి నిల్వను పెంచారు. దీంతో వర్షాకాలం వస్తే చాలు.. గ్రామంలో ఇళ్లన్నీ జాలు వారుతున్నాయి. బక్కయ్య దంపతుల ఇళ్లు నీటిలో ఉన్నట్లు కనిపిస్తోంది. గోడలు పదనెక్కాయి. ఇంటినిండా నీరు ఊరుతోంది. ఇంటి చుట్టూ నీరు చేరడంతో పాటు బయట అడుగు పెట్టేందుకూ ఇబ్బందిగా ఉంది. ప్రతీసారి వర్షాకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి మాట్లాడి పోతున్నారే తప్ప తమ బాధను ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భయం.. భయంగా గ్రామస్థులు

ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద రిజర్వాయర్‌లోకి చేరడంతో నారాయణపూర్ గ్రామస్థులు భయం భయంగా గడుపుతున్నారు. రిజర్వాయర్‌లోకి భారీగా నీరు చేరడంతో కట్టను ఆనుకుని ఉన్న ఇళ్ల గోడలకు పూర్తిగా చెమ్మ వస్తోంది. ఇళ్లలో నీరు ఊరుతుండడంతో బిక్కు బిక్కుమంటు చలిలో కాలం గడుపుతున్నారు. ఇరవైకి పైగా ఇళ్ల గోడలు పదనెక్కి ఇంట్లో నుంచి ఊట వస్తోంది. వరద కష్టాలతో ప్రతియేటా వర్షాకాలంలో ఇబ్బందుపడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌తో చర్లపల్లిలో పలు ఇళ్లలో నీరు చేరింది. రిజర్వాయర్ నిండింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.



ఇంటిలో నుంచి వస్తున్న ఊట నీరు



ఇంట్లోని వరద నీటిని తీసేస్తున్న వృద్ధురాలు

ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 4: నగరపాలక సంస్థలోని ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో ఎస్టాబ్లిస్‌మెంట్ విభాగం అధికారులు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్లు, బయోమెట్రిక్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉద్యోగుల సర్వీస్ రిలేటెడ్ ఫైల్స్, మృతిచెందిన ఉద్యోగులకు సంబంధించిన ఫైల్స్, పీఆర్సీ, ఇంక్రిమెంట్స్, ఎస్‌ఆర్ లాంటి ఫైల్స్‌ను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి సర్వీస్ బుక్ నిర్వహించాలన్నారు. డీటీవోకు బిల్స్ రిపోర్టు చేస్తూ వారి సమన్వయంతో సక్రమంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం

మున్సిపల్ కమిషనర్ మిర్జా ఫసహత్ ఆలీ బేగ్



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 4: సిరిసిల్ల పట్టణ పరిధి వార్డులలోని ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు మొలచి దోమలు పెరుగుతున్నాయని ఫిర్యాదు లు వస్తున్నాయని, ఆ ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మిర్జా ఫసహత్ ఆలీ బేగ్ అన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొత్త చెరువు నుంచి వరద ప్రవాహంతో కలిగిన సమస్యలపై దృష్టి సారించిన మున్సిపల్ అధికారులు బుధవారం సిరిసిల్ల పట్టణం శాంతినగర్, శ్రీనగర్ కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొత్త చెరువు వరద ప్రవాహంతో కాలనీ వాసులకు కొంత ఇబ్బంది కలగడం వాస్తవమైనా కొత్త చెరువు నీటిని ఒకే సారి వదలకుండా కొద్ది కొద్దిగా వదులుతున్నట్లు చెప్పారు. శాంతినగర్, శ్రీనగర్‌కాలనీలో నీటి నిల్వలు ఉన్నట్లుగా గుర్తించి జేసీబీ సహాయంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నవాటిని తొలగించామన్నారు. డ్రైనేజీలలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు స్ప్రేయింగ్, బ్లీచింగ్ పౌడర్ వేస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీలు, చెట్ల పొదలను తొలగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లిప్‌కార్ట్‌లో ఉద్యోగం పేరిట రూ.6.98 లక్షల టోకరా

జమ్మికుంట, సెప్టెంబరు 4: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటకు చెందిన వి శృతికి స్నాప్‌చాట్ ద్వారా పరిచయమైన గుర్తు తెలియని వ్యక్తి ఫ్లిప్‌కార్ట్‌లో ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి పలు మార్లు లక్షల రూపాయలు కాజేశాడు. ఫ్లిప్‌కార్ట్‌లోని వస్తువులకు మెసెజ్, లైక్ చేస్తే డబ్బులు వస్తాయని, అందుకు ముందుగా కొంత పెట్టుబడి పెట్టాలని నమ్మించాడు. గత నెల 27నుంచి ఈ నెల 3వ తేదీ వరకు పలు విడుతల్లో రూ.6.98లక్షలు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపించారు. తర్వాత ఫోన్ చేస్తే అవతలి వ్యక్తి నుంచి స్పందన కరువైంది. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుత చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 4: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను కరీంనగర్ మూడో ఠాణా పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మానేరు వాగు నుంచి ఇసుకలోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌ను హౌసింగ్‌బోర్డు కాలనీ బైపాస్‌రోడ్‌లో పట్టుకుని ఠాణాకు తరలించి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పెద్దాపూర్ గురుకులానికి తిరిగి వస్తున్న విద్యార్థులు



గురుకుల పాఠశాలకు తిరిగి వచ్చిన విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 4: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు ఇరువై రోజుల తరువాత విద్యార్థులు తిరిగి వస్తున్నారు. బుధవారం తిరిగి పునః ప్రారంభించిన గురుకులానికి ఇంటర్, పదో తరగతి విద్యార్థులు తరలి వచ్చారు. గురుకుల పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పాఠశాలకు రావడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. గురుకులంలోని పాఠశాలలో 410 మంది, కళాశాలలో 130 మంది మొత్తం 540 విద్యార్థులు చదువుకుంటున్నారు. గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతిచెందగా మరో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. తరువాత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోని ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులు క్లాస్‌లను నిర్వహించారు.

పాఠశాలలో జరిగిన సంఘటనలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందర్శించారు. గురుకులం అభివృద్ధికి కట్టుబడి ఉందని తక్షణమే రూ. 50లక్షలను నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాఠశాలలోని విద్యార్థులకు కావల్సిన వసతులు కల్పించడానికి సెలవులు ప్రకటించారు. అసంపూర్తిగా ఉన్న నూతన భవనంలోకి విద్యార్థులకు కావల్సిన డబుల్ కాట్ బెడ్స్, మౌలిక వసుతులు, కావల్సిన మరమ్మతులను చేయించారు. ఉన్నత అధికారుల సూచనల మేరకు పదో తరగతి, ఇంటర్‌మీడియట్ కళాశాల విద్యార్థుల భవిష్యత్ కోసం నేరుగా పాఠాలను నేర్పడానికి బుధవారం నుంచి గురుకుల పాఠశాల తరగతులను పునఃప్రారంభించారు. మరో వారంలోగా పూర్తిస్థాయిలో అన్ని తరగతులను ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. గురుకులంలో విద్యార్థులకు కావాల్సిన వసతుల తరువాత ఉపాధ్యాయుల సూచనల మేరకు విద్యార్థులు తిరిగి పాఠశాలకు వస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఎస్సీ గురుకుల కార్యదర్శిని తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్వేరోస్ ప్రతినిధులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 4: ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని వెంటనే తొలగించాలని స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మాతంగి మారుతి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. బ్రహ్మకుమారి అనే ఆధ్యాత్మిక సంస్థ ద్వారా విద్యార్థులకు మానసిక తరగతులను నిర్వహించేందుకు ఒప్పందం చేసుకున్నారని, దానిని రద్దు చేసి సీనియర్ సైకాలజిస్టులచేత తరగతులను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించిన ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, స్పోర్ట్స్ అకాడమిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో పిల్లలకు హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, గురుకులాలకు పక్కాభవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గోష్కి కుమార్, ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి రజిత, జాయింట్ సెక్రెటరీ కవ్వంపెల్లి విఘ్నేష్ పాల్గొన్నారు.

కొచ్చెరువు మత్తడి ధ్వంసం

వృథాగా పోతున్న నీరు



గంభీర్‌పూర్‌లో ధ్వంసమైన కొచ్చెరువు మత్తడి

కథలాపూర్, సెప్టెంబరు 4: మండలంలోని కొచ్చెరువు మత్తడి ధ్వంసం కావడంతో బుధవారం చెరువు నుంచి నీరు వృథాగా పోతోంది. గతంలోనే మత్తడి ధ్వంసం కాగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పైభాగంలో ఉన్న అడవుల్లోంచి పుష్కలంగా నీరు వస్తుండంతో వరద ప్రవాహం పెరిగింది. దీంతో గతానికి మించి మరికొంత మత్తడి ధ్వంసం కావడంతో నీరు కిందికి వృథాగా పోతోంది. మత్తడి మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ వర్షాకాలం ప్రారంభం కావడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది.

నిండుకుండల్లా ప్రాజెక్టులు

● ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
● 18 టీఎంసీలు దాటిన ఎల్‌ఎండీ

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	2,75,692	3,55,524	80.5	70.425
ఎల్లంపల్లి	3,39,782	2,40,262	20.175	13.667
మిడ్ మానేరు	19,017	9,850	27.54	21.766
ఎల్‌ఎండీ	20,840	283	24.034	18.589
ఎగువమానేరు	27,500	------	2.00	2.00


జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,75,692 క్యూసెక్కుల నీరు వస్తుంటే...41 గేట్లు పైకి ఎత్తి దిగువకు 3,55,524 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 19 వేల క్యూసెక్కులు వరద కాలువకు, నాలుగు వేల క్యూసెక్కులు కాకతీయ కాలువకు, నాలుగు వేల క్యూసెక్కులు ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్ తయారీకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు... ప్రస్తుతం 70.425 టీఎంసీల నీరు ఉంది. మహారాష్ట్రలోని నాసిక్, నాందేడ్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో శ్రీరాంసాగర్‌లోకి ఇన్‌ఫ్లో ఎక్కువగా వస్తోంది. గోదావరి నదిపై ఉన్న విష్ణుపురి ప్రాజెక్టు నిండింది. బాలేగావ్ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తడంతో పాటు దాదాపు 1.8 లక్షల క్యూసెక్కుల మేర వరద దిగువకు వస్తోంది. కామారెడ్డి జిల్లాలోని మంజీర, నిజామాబాద్ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతం, నిర్మల్ జిల్లాలోని గడ్డెన్న వాగు నుంచి మరో 80 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.

● శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

పెద్దపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి)/అంతర్గాం: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 3,39,782 క్యూసెక్కుల వరద నీరు ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్నది. దిగువకు 22 గేట్ల ద్వారా 2,40,262 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.667 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

● మిడ్ మానేరు ప్రాజెక్టు..

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షాలకు మానేరు, మూల వాగు ఎస్సారెస్పీ నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 19,017 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో మానేరు, మూలవాగు ద్వారా 2,405 ఎస్సారెస్పీ నుంచి 10,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ఎల్‌ఎండి ప్రాజెక్టుకు రెండు గేట్ల ద్వారా 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 21.766 టీఎంసీల మేరకు ఉంది.


దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు


ఎల్‌ఎండీలో నీరు

● నిండుతున్న ఎల్‌ఎండీ

తిమ్మాపూర్: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోని భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ ఇన్‌ఫ్లోతో ఎల్‌ఎండీ పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో కుంటలు, చెరువులు అన్ని నిండి మత్తడి దూకుతున్న నీరు మోయతుమ్మెద వాగులోకి వచ్చి చేరుతోంది. శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ నుంచి ఇరిగేషన్ అధికారులు ఎల్‌ఎండీలోకి బుధవారం నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం మోయతుమ్మెద వాగు నుంచి 33,856 క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 3,300 క్యూసెక్కులు, ఎగువ ప్రాంత్రం నుంచి 1,831 క్యూసెక్కులు, మొత్తం 25,285 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండిలోకి వచ్చి చేరుతోంది. ఔట్‌ఫ్లో 287 క్యూసెక్కులు ఉంది. ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలకు ప్రస్తుతం 18.074 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 22 టీఎంసీలకు చేరుకుంటే ఎల్‌ఎండీ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

పరివాహక ప్రాంతాలకు హెచ్చరిక

లోయర్ మానేరు డ్యామ్ ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. పోలీసు శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు.నదీ పరివాహక ప్రాంతంలోకి పశువులు, గొర్రెలు వెళ్లకుండా, చేపలు పట్టేవారు, గొర్రెల కాపరులు, రైతులు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. దిగువ పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

నవ వధువు ఆత్మహత్య

● వివాహం అయిన 18 రోజులకే ఘటన
● ఈ లోకంలో ఉండడం ఇష్టం లేకే అని చేతిపై రాత


భాగ్యలక్ష్మి (ఫైల్)

మల్యాల, సెప్టెంబరు 4: పెళ్లి అయిన నెల రోజులు కూడా గడవక ముందే ఓ నవవధువు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన కనుక భాగ్యలక్ష్మి (25)కి పక్క గ్రామం మ్యాడంపల్లికి చెందిన తడగొండ ఉదయ్‌కిరణ్‌తో గత నెల 18న వివాహం జరిగింది. ఉదయ్‌కిరణ్ హైదరాబాద్ లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండడంతో వివాహం అనంతరం హైదరాబాద్ వెళ్లారు. భాగ్యలక్ష్మిని తల్లిదండ్రులు మంగళవారం తక్కళ్లపల్లికి తీసుకువచ్చారు. బుధవారం భాగ్యలక్ష్మి తల్లిదండ్రులు పనుల నిమిత్తం మల్యాల వెళ్లారు. దీంతో ఇంట్లో భాగ్యలక్ష్మి ఒక్కరే ఉండగా మధ్యాహ్నం వచ్చిన వాళ్ల తల్లి బాత్‌రూంకు వెళ్లేసరికి బాత్ రూంలో చున్నీతో ఉరివేసుకొని కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై నరేశ్‌కుమార్ సంఘట స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా మృతురాలి చేతిపై 'తాను ఎవరి కారణం వల్ల చనిపోవడం లేదని, నన్ను ఎవరూ ఏమీ అనలేదని, నాకే ఈ లోకంలో ఉండడం ఇష్టం లేదని అందుకే వెళ్లిపోతున్నా.. అని రాసి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పవర్‌లూం క్లస్టర్‌తో నేత కార్మికులకు ప్రయోజనం

● యారన్ సబ్సిడీ 80 శాతానికి పెంచాలి ● నేత కార్మికులకు పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలి
● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ● కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు వినతి

సిరిసిల్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో మెగా పవర్‌లూం క్లస్టర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మంది నేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గిరిరాజ్‌సింగ్‌ను సన్మానించారు. సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ మంజూరు చేయాలని, యారన్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. యారన్ సబ్సిడీని 80 శాతానికి పెంచాలని, పావలా వడ్డీకి రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా యంత్రాల ఆధునికీకరణతో పాటు ఉత్పాదకతను కార్మికుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వం పెంచుతుందని పేర్కొన్నారు. నాణ్యమైన వస్త్రాలను అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. యారన్ డిపోతో ముడిసరుకులు సులభంగా, తక్కువ ధరకు లభిస్తాయని వివరించారు. యారన్ సబ్సిడీని 80 శాతానికి పెంచడంతోపాటు పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలని కోరారు. టెక్స్‌టైల్ శాఖ మంత్రి పవర్‌లూం క్లస్టర్ యారన్ డిపో మంజూరుపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ రుణాలపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారని వివరించారు.


కేంద్ర చేనేత జౌళిశాఖ మంత్రిని సన్మానిస్తున్న బండి సంజయ్

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 4: మద్యం తాగి వాహనం నడిపిన రంగాపూర్‌కు చెందిన వేములవాడ మహేష్ అనే యువకుడికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం జగిత్యాల న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. మద్యం తాగి మహేష్ వాహనం నడపడంతో ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం కేసు నమోదు చేసి సంబంధిత కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనదారుల అజాగ్రత్త చర్యల వల్ల అవతలి వ్యక్తులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారకు. వారి కుటుంబాలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం వాహనదారులకు సూచించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

దొంగతనం కేసుల్లో ముగ్గురికి జైలు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 4: జిల్లాలోని వివిధ చోట్ల దొంగతనం చేసిన కామారెడ్డి జిల్లా బతుకమ్మకుంటకు చెందిన వెంకల్‌వాడ మారుతి, ఇందిరానగర్‌కు చెందిన మండల సాయికుమార్‌లకు ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధిస్తూ ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు ఇచ్చారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వీరిద్దరు దొంగలు ఫిబ్రవరి 19, 2023న సిరిసిల్ల పట్టణంలోని మల్లికార్జున వైన్స్‌లో , కార్తికేయ వైన్స్‌లలో చోరీకి పాల్పడ్డారని, మార్చి 13, 2023న సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో గల దత్తునాయక్ ఇంటి ఎదుట పార్క్‌చేసిన ద్విచక్రవాహనం , అదే రోజు ప్రశాంత్‌కు ఇంట్లో చోరీకి పాల్పడ్డారని ఆయన తెలిపారు. ఈకేసుల్లో సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసి ఇద్దరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు. విచారణ అనంతరం కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున సందీప్ వాదనలు వినిపించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరస్థులకు ఒక ఏడాది కఠినకారాగార శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధించారని ఆయన తెలిపారు.

ఇదేవిధంగా మరో వాహన చోరీ కేసులో గంభీరావుపేటకు చెందిన అంకం రాజు అనే వ్యక్తికి ఏడునెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని ఆయన తెలిపారు. సమాజంలో నేరం చేసిన వారెవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని తెలిపారు. అయిదు కేసులలో శిక్షలు పడడంలో కృషిచేసిన పిపి సందీప్, సిఎంఎస్ ఎస్ఐ రవీంద్రనాయకుడు, కోర్టు కానిస్టేబుల్ నరేశ్‌ను ఎస్పీ అభినందించారు.

నిప్పు అంటించుకొని ఒకరి ఆత్మహత్య

తిమ్మాపూర్, సెప్టెంబరు4: మండలంలోని ఇందిరానగర్ గ్రామ శివారులో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్‌పోసుకొని నిప్పు అంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్‌ఎండి ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న సత్తు రఘు(48) కరీంనగర్‌లోని శ్వేత హోటల్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఇంటి నుండి బయలుదేరి ఇందిరా నగర్ గ్రామ శివారులో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు, పూర్తి వివరాలు తెలియల్సిఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు.

మల్యాలలో రేషన్ దుకాణాల తనిఖీ

మల్యాల, సెప్టెంబరు 4: రేషన్‌బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా అపోహపడవద్దని, రేషన్‌బియ్యంలోనే అనేక పోషక పదార్థాలు ఉంటాయని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారి కృష్ణ అన్నారు. మల్యాలలోని పలు రేషన్ దుకాణాలను నాణ్యత ప్రమాణాల అధికారి రసీద్ ఇతర అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో బియ్యం నాణ్యత పరిశీలించారు. రేషన్ లబ్ధిదారులతో మాట్లాడారు. నాయబ్ తహసీల్దార్ బి శ్రీనివాస్, బీఎన్ స్వామి, వంశీ తదితరులు ఉన్నారు.

మద్దులపల్లిలో జాలరి అదృశ్యం


బాబు (ఫైల్)

పెగడపల్లి, సెప్టెంబరు 4: పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గన్నెబోయిన బాబు (52) అనే జాలరి మంగళవారం సాయంత్రం నుంచి అదృశ్యమయినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. ఎస్ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాబు మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు గ్రామ శివారులోని చెరువు మత్తడి వద్దకు చేపలు పట్టేందుకని వెళ్లాడని, తిరిగి ఇంటికి రాలేదన్నారు. బాబు భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,550 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 15క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,550 చొప్పున పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

మల్యాల, సెప్టెంబరు 4: మండలంలోని బల్వంతాపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులపై నమోదు అయిన ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ రఘుచందర్ బుధవారం విచారణ జరిపారు. బల్వంతాపూర్‌కు చెందిన రమేష్, సురేశ్ అనే వ్యక్తులపై ఇదే గ్రామానికి చెందిన తొడేటి బాబు అనే వ్యక్తి కారు డబ్బుల విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మూడురోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కాగా డీఎస్పీ బల్వంతాపూర్‌లో విచారణ జరిపారు. డీఎస్పీ వెంట ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

జ్వరంతో బాలుడి మృతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మూడేళ్ల బాలుడు హర్షిత్ విష జ్వరంతో మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేటలోని తుడుం రవళి-అజయ్ దంపతుల కుమారుడు హర్షిత్‌కు నాలుగు రోజుల కిందట జ్వరం రావడంతో సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.. పరిస్థితి విషమంగా మారడంతో అదేరోజు వైద్యుల సూచనల మేరకు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి బాలుడు మృతి చెందాడు. సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వెంటిలేటర్ సౌకర్యం లేకపోవడం వల్ల తమ కొడుకుకు మెరుగైన వైద్యం అందకుండాపోయిందని తల్లిదండ్రులు ఆరోపించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పర్శరాములు, నర్సింలు, బాలరాజుయాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపిక


ప్రమోదకుమార్


పద్మావతి

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 4: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాలలో తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ తత్వాది ప్రమోదకుమార్ ఈ ఏడాది ఉత్తమ రాష్ట్ర అధ్యాపక పురస్కారానికి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట రామకృష్ణ తెలిపారు. సెప్టెంబరు 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరబాద్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో జన్మించిన ప్రమోదకుమార్ పీహెచ్‌డీ పూర్తిచేసి, 1998 నుంచి అధ్యాపక వృత్తిలో కొన సాగుతున్నారన్నారు. ఓవైపు అధ్యాపక వృత్తిలో రాణిస్తూనే, మరోవైపు తెలుగు సాహిత్యంలో రచనలు చేస్తున్నారని, ప్రమోదకుమార్ అనువదించిన కన్నడ కథలు, చతుర, విపుల, వార్త, ఆంధ్రజ్యోతి, స్రవంతి మొదలైన వార పత్రికల్లో ప్రచురితం అయ్యిందన్నారు. రచనలతో పాటు సెమినార్‌లో పాల్గొని దాదాపు 30కిపైగా పత్ర సమర్పణలు చేశారన్నారు. 2013-14, 2014-15 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియేట్ తెలుగు పాఠ్యప్రణాళిక సంపాదకమండలి సభ్యుడిగా, కోర్స్ రైటర్‌గా పనిచేశారన్నారు. ప్రమోదకుమార్ ఉత్తమ అధ్యాపకుడిగా ఎన్నికవడంపై సహచర అధ్యాపకులు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

గణేశ్‌నగర్ : రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి శాతవాహన యూనివర్సిటీ సోషియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ పద్మావతి ఎంపికైనట్లు యూని వర్సిటీ అధికారులు తెలిపారు. గురువారం హైదరాబా ద్‌లోని రవీంద్ర భారతిలో ఆమె ఈ అవార్డును అందుకోనున్నారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు

చిగురుమామిడి, సెప్టెంబరు 4: చిగురుమామిడి మండలంలోని నవాబ్‌పేటలో కక్కెర్ల శ్రీహన్సిని అనేక బాలికపై కుక్కలు దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలోని పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో శ్రీహన్సిని కుక్కలు వెంబడించి గాయపరిచాయి. దాంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటని అధికారులు నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రకృతి వైపరీత్యాలను జాతీయ విపత్తుగా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 4: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరదలు, ప్రకృతి వైపరీత్యాలతో జరిగిన నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో రాష్ట్రమంతటా వరద ఉధృతితో అతలాకుతలం అయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహచర మంత్రులు, సభ్యులు నష్టాన్ని పరిశీలించారన్నారు. గత ప్రభుత్వం ఏనాడూ ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన ప్రజలను, మత్స్యకారులను ఆదుకున్నది లేదన్నారు. బీర్‌పూర్ మండలం రోళ్లవాగు వరదతో పంటపొలాల్లో ఇసుక మేటలు వేసి కోట్ల రూపాయలు పంట నష్టం వాటిల్లితే, పైసా నష్టపరిహారం గత ప్రభుత్వం నుంచి అందలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాయమందిస్తే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో అధికారంలో ఉన్నపుడు ఏం చేశారనేది ప్రతిపక్ష నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్రతిపక్షం అంటే విమర్శలు చేయడం కాదనే విషయాన్ని గుర్తెరుగాలన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా పర్యటించకపోవడం, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం ఎక్స్ వేదికగా విమర్శలు చేయడం విచారకరం అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ పర్యటన రద్దుచేసుకొని, సహాయక చర్యల్లో పాలుపంచుకోవాల్సింది పోయి, విమర్శలు చేయడం సరికాదని అదే వేదికగా సలహాలు, సూచనలు ఇవ్వాలని హితవుపలికారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తం వరదల ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు అహర్నిషలు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో వరదల ప్రభావం 10వేల కోట్ల వరకు నష్టం ఉంటుందని, అందులో నుంచి కనీసం రూ.5వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంటు రూపంలో విడుదలకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవచూపాలని కోరారు. రాష్ట్ర రాజధానిలో చెరువులు, నాళాలు అక్రమణకు అడ్డుకట్టవేసేందుకు తీసుకువచ్చిన హైడ్రాతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల్లో కూడా అమలుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించడం శుభపరిణామం అన్నారు. సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, మాజీ చైర్మెన్ గిరినాగభూషణం, ఫ్లోర్‌లీడర్ దుర్గయ్య, బ్లాక్ ప్రెసిడెంట్ పొలాస నందయ్య, మండలాధ్యక్షుడు జున్ను రాజేందర్, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, మాజీ ఎంపీపీలు మహేష్, ధర రమేష్, మాజీ వైస్ ఎంపీపీ గంగం మహేష్, మాజీ ఎంపీటీసీ రాధాకిషన్ రావు తదితరులున్నారు.

అవమానం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

● ఒకరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మల్యాల, సెప్టెంబరు 4: తమ గ్రామానికి చెందిన వ్యక్తి తనను చెంపపై కొట్టాడని అవమానం భరించలేక సూసైడ్ నోట్ రాసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మ్యాడంపల్లిలో జరిగింది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మ్యాడంపల్లికి చెందిన తరాల లచ్చయ్య(48) అనే వ్యక్తి బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలంలో మృతికి ముందు సూసైడ్ నోట్ రాసి పెట్టాడు. గ్రామానికి చెందిన గీకుడు నారాయణ అనే వ్యక్తి తన చెంపపై కొట్టాడని దీంతో తాను గ్రామంలో అవమానం భరించలేనని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. దీంతో నారాయణపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీ బైక్ ఢీ .. ఒకరికి గాయాలు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 4: సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన సుగ్లాంపల్లి సబ్‌స్టేషన్ వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సుగ్లాంపల్లి - నారాయణపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో ఓ యువకుడు బైక్‌పై వెలుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ లారీ కిందకు దూసుకుపోయింది, బైక్ నడుపుతున్న మంచిర్యాల జిల్లా తాల్లపల్లి సింగాపూర్‌కు చెందిన అన్నం సాయితేజ తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదం జరగడంతోనే లారీని వదిలి లారీ డ్రైవర్ పారిపోయాడు.

శిథిల ఆవాసాలలో.. సమస్యలతో సహవాసం

● వర్షం వస్తే సెలవులే ● తాటిపల్లి గురుకులంలో విద్యార్థుల ఇబ్బందులు


అసౌకర్యాల మధ్య విద్యార్థులు పడుకునే గది


తలుపులు లేని తరగతి గదులు

మల్యాల, సెప్టెంబరు 4: మల్యాల మండలంలోని తాటిపల్లి బాలికల గురుకులంలో పాఠశాల, ఇంటర్ విద్యార్థినులు శిథిల భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. సరైన వసతి, సౌకర్యాలు లేక అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. సౌకర్యాలు లేకపోవడంతో వర్షాలు కురిస్తే పాఠశాలకు సెలవులు ప్రకటిస్తున్నారు. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల పట్టింపు లేని వైనంతో విద్యార్థులు ఏళ్లుగా అసౌకర్యానికి గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ స్కూల్ పరిధిలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గల తాటిపల్లి గురుకులానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. శిథిల భవనాలు, అసౌకర్యాలను పట్టించుకోకపోవడం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యార్థులు పడుకునే గదుల రేకులకు చిల్లులు పడి ఉన్నాయి. కొన్ని తరగతి గదుల్లోనూ అదే పరిస్థితి నెలకొనగా తలుపులు కూడా ఊడిపోతున్నాయి. శిథిల భవనాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో ఇటీవల కురిసిన వర్షాలకు సెలవులు ప్రకటించడాన్ని బట్టి ఇక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ధర్మపురి వద్ద కొనసాగుతున్న గోదావరి వరద


ధర్మపురి వద్ద నిండుగా ప్రవహిస్తున్న గోదావరి

ధర్మపురి, సెప్టెంబరు 4: ధర్మపురి వద్ద గోదావరి నది వరద బుధవారం సాయంత్రం వేగంగా కొనసాగింది. కొన్ని రోజుల నుంచి గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రాజెక్టులోకి 13,092 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన ఐదు గేట్లు తెరచి 28,635 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి అధికారులు విడుదల చేశారు. గోదావరి నీటి మట్టం పెరిగింది.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 4: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ వి రవీందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో న్యూట్రిషన్ వారోత్సవాలను రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతిమ మెడికల్ కళాశాల ఫార్మకాలజి డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ హెచ్‌ఓడీ డాక్టర్ జ్యోతిర్మయి, ప్రొఫెసర్ శ్రీధర్ హాజరయ్యారు. ఈసందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ మహిళలు రక్తహీనతను అధిగమించాలన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో పోషకాహారం ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థినిలు ప్రదర్శించిన స్టాళ్లు, ప్రజెంటేషన్లు పోషకాహార నమూనాలు అలరించాయి.

జిల్లా జడ్జిని కలిసిన నగర పాలక కమిషనర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 4: కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ జిల్లా జడ్జి ప్రతిమను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కోర్టు ఆవరణలోని జడ్జి నివాసానికి కమిషనర్ వెళ్లి నగరంలోని పలు అంశాలపై చర్చించారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

-ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 4: వర్షాల నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ సూచించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు/సపోర్టు వైరును, స్తంభాలను, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకరాదని తెలిపారు. విద్యుత్ సరఫరా వైర్లను ఎట్టి పరిస్థితుల్లో దండెంలకు, రేకులకు తగలకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం ప్రమాదకరమన్నారు. ఎవరికైనా పొరపాటున కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరలోని వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలన్న ఆతృతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ముట్టుకోరాదన్నారు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని కర్ర, ప్లాస్టిక్ లాంటి వస్తువులను వాడాలన్నారు. విద్యుత్ అంతరాయానికి సంబంధించిన సమస్యలు ఉంటే 1912,18004250028 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

'నమ్మించి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి'

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 4: రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడి కోసం వడ్డీకి డబ్బులు తీసుకుంటే తన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని, తనకు ఎంఓయూ ఇవ్వకుండా మోసం చేసిన ఘటనలో సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని హన్మకొండకు చెందిన రాయి సమ్మయ్య పోలీస్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆలేరు గ్రామంలో 20 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన తనకు పెట్టుబడి డబ్బులు సర్దుబాటు కానందున కరీంనగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారులు ఎలగందుల వీరేశం, నాంపెల్లి నాగార్జునాచారి, ఎన్నంపల్లి మునీందర్‌లు తనకు 3 కోట్లు డబ్బులు 2 రూపాయల వడ్డీకి ఇస్తూ ష్యూరిటీ కింద తన భూమిని వారి పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, తను డబ్బులు చెల్లించిన అనంతరం తన భూమిని తనకు రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆ ముగ్గురు వ్యాపారులు తనకు మరో ఎంఓయూ రాసి ఇచ్చేందుకు ఒప్పందం జరిగిందని తెలిపారు. అయితే తన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న ముగ్గురు వ్యాపారులు తనకు ఎంఓయూ ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారని బాధితుడు సమ్మయ్య ఆరోపించారు. మరో వ్యాపారి చిట్టుమల్ల శ్రీనివాస్ జోక్యంతో ఈ వివాదం అప్పటి మంత్రి వద్దకు వెళ్ళగా చిట్టుమల్ల శ్రీనివాస్ తనకు రావాల్సిన 2 కోట్ల 20 లక్షల రూపాయలు చెల్లిస్తానని హామీ ఇచ్చాడు. ఆ తరువాత 40 లక్షలు తక్కువ ముట్టచెప్పిన చిట్టుమల్ల శ్రీనివాస్ తనను బెదిరించి మోసం చేశారని తెలిపారు. తనను నిలువునా ముంచి, తనను నమ్మించి మోసం చేసిన నలుగురిపై న్యాయపరంగా చర్యలు తీసుకోవాలని బాధితుడు సమ్మయ్య పోలీస్‌కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రూ.5 కోట్ల ఇన్సూరెన్స్ అందజేత

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 4: జిల్లా కేంద్రంలోని జ్యోతినగర్‌కు చెందిన అంతగిరి రాజు ఐదు సంవత్సరాల క్రితం టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీలో ఐదు కోట్ల కవరేజ్ టర్మ్‌పాలసీ తీసుకు న్నాడు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన నామిని అయిన భార్య శశికళకు రూ.5 కోట్ల చెక్కును కరీంనగర్ సీనియర్ బ్రాంచి మేనేజర్ రామకృష్ణారెడ్డి అందజేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వీరస్వామి, ఆదర్శ్‌కుమార్, సుమలత, చంద్రశేఖర్, ఆపరేషన్ మహేందర్, సీనియర్ పార్టనర్ నరేందర్‌రావు, లీడర్ శ్రీకాంత్, రాజు, సృజన్ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

మానకొండూర్, సెప్టెంబరు 4: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరూ ఓటు నమోదు చేసుకోవాలని అసిస్టెంటు రిటర్నింగ్ అధికారి బి. రాజేశ్వరి కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఓటరు లిస్టులో రెండు సార్లు నమోదైన ఓటర్లతో పాటు మృతిచెందిన వారు, వివాహం అయి వెళ్లిపోయిన ఓటర్లను తొలగించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ సమ్మయ్య, ఆర్ఐ జయలక్ష్మీ, రాజకీయ నాయకులు, సిబ్బంది ఉన్నారు.

హుజూరాబాద్‌లో అస్తవ్యస్తంగా మురికి కాలువ

హుజూరాబాద్, సెప్టెంబరు 4: హుజూరాబాద్ పట్టణంలోని 3వ వార్డులో మురికి కాలువ పూర్తిగా ధ్వంసం కావడంతో నీళ్లన్నీ ఇళ్ల ముందు నిలిచిపోతున్నాయని బుధవారం కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. గతంలో నిర్మించిన మురికి కాలువ దెబ్బతిని చాలా రోజులైనప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని వాపోయారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి మురికి కాలువను మరమ్మతు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు


ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

జమ్మికుంట, ఆగస్టు 4: జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో రుణమాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు బుధవారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి పరిశీలించారు. త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎరువుల దుకాణంలో నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడిఏ సునిత, ఏవో రజిత, ఏఈవోలు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గంగాధర, సెప్టెంబరు4: ఐసీడీఎస్‌లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి అన్నారు. బుధవారం గంగాధర మండలం పత్తికుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ బరువుతో జన్మించిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి మంగళవారం చొప్పదండి పీహెచ్‌సీకి వెళ్లి మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ, సూపర్‌వైజర్ రేణుక ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రామడుగు, సెప్టెంబర్ 4: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు చేయూతనందించారు. ఈ సందర్భంగా 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దాసరి కనకయ్య, జనరల్ సెక్రటరి దాసరి రవిశాస్త్రి, జాయింట్ సెక్రటరి వడ్లూరి సిద్ధూ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ తడగొండ మల్లేశం, సభ్యులు రాజశేఖర్, నరసయ్య, దాసరి శంకర్ ఉన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి


జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి సరస్వతిని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 4: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సరస్వతి అన్నారు. వాగ్దేవి వనితా క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సహకారంతో బుధవారం మహిళా డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ గురించి ప్రత్యేక కార్యక్రమం చేప ట్టారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కేసి గుప్తా జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వాసవి వీక్ ఆక్టివిటీస్‌లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సరస్వతి హాజరై మాట్లా డుతూ మహిళలు ప్రేమ పేరుతో మోసపోవద్దని తెలిపారు. సోషల్ మీడియాలో పరిచయమైన వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. పౌష్టికాహారంతో శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవాలని కోరారు. అలాగే అప్పుడప్పుడు రక్తపరీక్షలు నిర్వహించుకుని ఎర్ర రక్త కణాల శాతాన్ని నిర్ధారించుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డి.వరలక్ష్మి మాట్లాడుతూ కలకత్తా వైద్య విద్యార్థిని సంఘటన గురించి ప్రస్తావిస్తూ మహిళలు పరిసరాలు అనుకూలంగా లేని చోట ఉద్యోగాన్ని మానేసి మరొక ఉద్యోగానికైనా వెళ్లడానికి వెనకాడ వద్దని కోరారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం, నమ్మకం పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి, వాగ్దేవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, వాసవి క్లబ్ క్యాబినెట్ సెక్రెటరీ జంధ్యం మధుకర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ లక్ష్మణరావు, స్రవంతి, స్వరూప పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని మల్లీశ్వరి అమ్మ గురించి పాడిన పాట అందరినీ అలరించింది. అనంతరం అతిథులను వాగ్దేవి క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి ఘనంగా సత్కరించారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 4: ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎండీ హబీబుద్దీన్ కుటుంబానికి 1995 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు లక్షా 95 వేల రూపాయలను ఏఆర్ అడిషనల్ డీసీపీ ఆర్.అనోక్ జైకుమార్ చేతుల మీదుగా అందజేశారు. కమిషనరేట్‌లో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కుమార స్వామి, ఆర్ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు పద్య నీరాజనం పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 4: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు విశ్రాంత ఉపన్యాసకుడు డాక్టర్ బొద్దుల లక్ష్మయ్య రచించిన పద్య నీరాజనం పుస్తకావిష్కరణ ఉంటుందని అధ్యక్ష కార్యదర్శులు మోసం అంజయ్య, దామెర మహేంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అతిథులుగా డీఈఓ ఎస్వి జనార్దనరావు, ట్రెజరీస్ ఉప సంచాలకుడు యు నాగరాజు హాజరౌతారని, వైరాగ్యం ప్రభాకర్ పుస్తక సమీక్ష చేస్తారని పేర్కొన్నారు. కవులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

'చౌకబారు ప్రకటనలు మానుకోవాలి'

సుభాష్‌నగర్, సెప్టెంబరు4: చౌకబారు మాటలు మానుకోవాలని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద బాధితులకు ఆపన్నహస్తం అందించడానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ముందుకు వచ్చి రూ.130కోట్ల రూపాయలు ప్రభుత్వానికి అందించారని తెలిపారు. అయితే లచ్చిరెడ్డి అనే నాయకుడు తాను జేఏసీ నాయకుడిగా, బాధ్యునిగా పేర్కొంటూ వంద కోట్ల విరాళం తాను ఇప్పించినట్లుగా ప్రకటనలు చేస్తున్నాడని ఆయన ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, మడిపెల్లి కాళీచరణ్, నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, తిరుమల, శారద, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, శంకర్, ముప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి, హర్మిందర్‌సింగ్, బల్బీందర్‌సింగ్, రాజేశ్‌భరద్వాజ్, సర్దార్ మంజిత్‌సింగ్, వెంకటయ్య పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 4: భారీగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ఏరియాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు, వరద నీరు వచ్చిచేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సమస్యలను పరిష్కరించాలని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ కోరారు. వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే వారి సమస్యలను త్వరగా పరిష్కరించాల్సిన బాధ్యత మేయర్, కమిషనర్‌పై ఉంటుందన్నారు. మేయర్ విదేశాల్లో ఉన్నారని, కమిషనర్ కూడా లోతట్టు ప్రాంతాల ప్రజల సమస్యలను పరిశీలించేందుకు పర్యటించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

'విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేయాలి'

భగత్‌నగర్, సెప్టెంబరు 4: శాస్త్రీయ విద్య సాధనే ధ్యేయంగా విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంగిడి కుమార్, ముక్కల మారుతి అన్నారు. బుధవారం నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో యాభై వసంతాల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత విద్యార్థి ఉద్యమ చరిత్రలో పిడిఎస్‌యు ప్రత్యేక చరిత్ర కలిగి ఉన్నదన్నారు ఎందరో వీరులు విద్యార్థుల హక్కులు, శాస్త్రీయ విద్య, సమయ సమాజ స్థాపన కోసం అమరులయ్యారన్నారు. 78 సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లీం, మైనార్టీ పీడిత వర్గాలకు ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. పోరాట ఉద్యమ వారసత్వాన్ని ముందుకు కొనసాగిద్దామని ఈసందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రణాడి అజయ్, అంజనీ ప్రసాద్, తాటిపల్లి గౌతం, రిషి వరుణ్, సుధాకర్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి: సీపీ


సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సెయింట్‌జాన్స్ ప్రధానోపాధ్యాయురాలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 4: జీవితంలో ఎదురైన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని తద్వారా ఏదైనా సాధించ వచ్చని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ సెయింట్ జాన్స్ హైస్కూల్ జరిగిన ఒక కార్యక్రమానికి సీపీ అభిషేక్ మొహంతి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సీపీ అభిషేక్ మొహంతి స్కూల్ పూర్వ విద్యార్థి కావడం గమ నార్హం. విద్యార్థులను ఉద్దేశించి సీపీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెదలాలన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సీపీ సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ పి ఇన్నాలు, ప్రైమరీ బ్లాక్ ఇన్‌చార్జి సిస్టర్ ఆరోగ్య మేరి పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేలను అవమానపరుస్తున్నారు

-సీఎం దృష్టికి తీసుకెళ్తా-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 4: ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరిలో దళిత ఎమ్మెల్యే వేముల వీరేశం (నకిరేకల్)కు పోలీసులతో జరిగిన ఘోర అవమానంతో పాటు మానకొండూర్ సీఐ పోస్టింగ్ విషయంలో కరీంనగర్ సీపీ వ్యవహరించిన తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్‌ల దృష్టికి తీసుకుపోనున్నట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆహ్వానం మేరకు భువనగిరికి వచ్చిన మంత్రులు ఉత్తం కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వానం పలికేందుకు హెలికాప్టర్ వద్దకు వెళ్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశంను అడ్డుకోవడమే కాకుండా ఛాతిపై చేయి వేసి తోసివేసి ఘోరంగా అవమానించారని ఆయన ఆరోపించారు. ఇది ప్రభుత్వపరంగా జరిగిన తప్పిదం ఎంతమాత్రం కాదని, ఎస్సీల పట్ల పోలీస్ అధికారులకు ఉన్న చులకనభావం కారణమని ఆయన పేర్కొన్నారు. దురహంకార పోకడలు గల పోలీసు అధికారులు అక్కడక్కడా ఉన్నారని, కరీంనగర్ పోలీస్ బాస్ కూడా ఇదే తరహా పోకడలను అనుసరిస్తున్నారని ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆరోపించారు. మానకొండూర్ సీఐ పోస్టు ఖాళీగా ఉండటంతో అక్కడ సీఐని ముఖ్యమంత్రి సహకారంతో నియమిస్తే దాన్ని కరీంనగర్ సీపీ రద్దు పర్చారని, త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించకుండా సీఐకు పోస్టింగ్ ఇవ్వడం కుదరదని మెలిక పెట్టగా, సీపీ సూచన మేరకు బోర్డ్‌మీటింగ్ నిర్వహించి సీఐ పోస్టింగ్ ఇచ్చారని ఆయన తెలిపారు. అయితే నేను కాదన్నా ఎలా పోస్టింగ్ తెచ్చుకున్నావంటూ సదరు సీఐని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కరీంనగర్ సీపీ నిర్వాకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం దృష్టికి తేనున్నట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి తెలిపారు.

రహదారి నిర్మాణానికి కృషి చేస్తా


బోర్నపల్లిలో మహిళా రైతులతో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, సెప్టెంబరు 4: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి నుంచి ఇప్పల్‌నర్సింగాపూర్ వరకు రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలోని రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఆయన నిధులు తీసుకొచ్చి రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రణవ్ పంపిణీ చేశారు. వివిధ కారణాల వల్ల అనారోగ్యానికి గురైన వారి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అర్హులైన వారందరికీ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● వీణవంక: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకోగా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సహాయం అందివగా చెక్కులను హుజూరాబాద్ నియోజికవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాధితులకు అందించారు. ఘన్ముక్ల గ్రామనికి చెందిన అశ్రిన్, బొంతుపల్లి గ్రామానికి చెందిన అడ్లూరి అశోక్, హిమ్మత్‌నగర్‌కు చెందిన మారం సరోజనలకు దాదపు లక్ష యాభై వేయిల రూపాయల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎండీ సలీం, సాహెబ్ హుస్సేన్, నసీరోద్దీన్, మోహన్‌రెడ్డి, సంపత్, పైడి కుమార్, జైపాల్ రెడ్డి, గట్టయ్య, ఉపేందర్ తదితరులున్నారు.

మాజీ మంత్రుల వాహనంపై దాడి అమానుషం

చిగురుమామిడి, సెప్టెంబరు 4: ఖమ్మంలో బీఆర్ఎస్ మాజీ మంత్రుల వాహనంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు దాడి చేయడం అమానుషమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన ప్రజలను పరామర్శించేందుకు వెళ్ళిన మాజీ మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ తదితరులు ప్రయాణిస్తున్న వాహనంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దాడిచేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నేతల చర్య సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. భారీ వర్షాలకు వరదలు వచ్చి కష్టాల్లో ఉన్న ఖమ్మం ప్రజానికానికి భరోసా ఇవ్వడం మానేసి భయభ్రాంతులకు గురిచేయడం అమానుషమన్నారు. మాజీ మంత్రులపైనే దాడులు చేస్తే ఇక సామాన్య ప్రజల సంగతి ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి దాడులు చేసినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీ భయపడదని, ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు.

విద్యార్థుల్లో భాషా సామర్థ్యాలు పెంపొందిచాలి

- డీఈవో జనార్ధన్‌రావు

సైదాపూర్, సెప్టెంబరు 4: పాఠశాలల్లో విద్యార్థుల భాషా సామర్థ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు అన్నారు. బుధవారం సైదాపూర్ ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో అంతఃర్లీనంగా ఉన్న ప్రతిభను గుర్తించి అన్ని రంగాలలో ఎదిగేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీ పీరియడ్ నిర్వహించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ లిఫ్ కార్యక్రమాలను మండలాధికారులు పర్యవేక్షించి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం అన్ని పాఠశాలల్లో అమలు చేసి విజయవంతం చేయాలన్నారు. అనంతరం పాఠశాలల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కే శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి కటా రవీంద్రచారి, కాంప్లెక్స్ ప్రధానోపద్యాయులు ప్రభాకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెగిపడ్డ విద్యుత్ తీగలు

శంకరపట్నం, సెప్టెంబరు 4: శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామ శివారులో విద్యుత్ తీగలు తెగిపడి ప్రమాదకరంగా ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. నాలుగు రోజుల క్రితం పొలంలో వైర్లు తెగిపడి ఉన్నాయని అధికారులు మరమ్మతు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు పుట్టపాక సదయ్య, పుట్టపాక రాజయ్యలు అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెట్లు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వెంటనే అధికారులు మరమ్మతు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.


బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

రామడుగు, సెప్టెంబర్ 4 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద చేపడుతున్న రోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన పాత బ్రిడ్జి కూలిపోవడంతో యుద్ధ ప్రాతిపదికన కొత్త బ్రిడ్జి వద్ద ఏర్పాట్లు చేపట్టి ద్విచక్ర వాహనాలు వెళ్లే విధంగా చేశారు. పెద్ద వాహనాలు వెళ్లడానికి వీలుగా బ్రిడ్జికి ఇరువైపులా మట్టి పోసి రోడ్డు పనులు జరుగుతున్నాయి. మరో రెండు రోజుల్లో పనులు పూర్తయి ప్రారంభమయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 4: నగరంలో కొత్త లైన్‌లు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం ఉదయం 10 గంటల నుండి 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. సుభాష్‌నగర్, మంచిర్యాల్ ఎక్స్‌రోడ్, వెంకటసాయి, మంచిర్యాల్ ఎక్స్ రోడ్, ఆదర్శనగర్, వావిలాల రామ్‌రెడ్డినగర్, శివనగర్, అంబేద్కర్‌నగర్, బుట్టిరాజారాం కాలనీ, సుభాష్‌నగర్,కిసాన్‌నగర్, ఎస్టీ కాలనీ, సరస్వతినగర్, భారత్ టాకీస్ ఏరియా పద్మశాలి వీధి, లక్ష్మీనగర్, హన్మాన్ టెంపుల్‌రోడ్, శాషామహల్, శ్రీనివాస టాకీస్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్4: కరంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.మాలతో ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో అడ్మిషన్ కోరకు ఎస్.సి విద్యార్థినిలకు స్పాట్ అడ్మిషన్‌లు ఉన్నాయని, డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడానికి ఇంటర్‌లో ఉత్తీర్ణత చెందిన ఎస్‌సి విద్యార్థినిలు, పదవ తరగతి, ఇంటర్, కుల ధృవీకరణ పత్రాలు, ఇన్‌కమ్ సర్టిఫికెట్స్ ఒర్జినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో ఈ నెల 6వ తేదిన కళాశాలలో సంప్రదించాలని కోరారు.

'ఈడీ కేసు మాఫీ కోసమే ఢిల్లీకి గంగుల'

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు4: గ్రానైట్ సంస్థకు సంబంధించిన పన్ను ఎగవేసిన ఈడీ కేసు నుంచి బయటపడేందుకే ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీజేపీతో చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగు తున్నాడని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇందుకోసమే వారానికోసారి ఢిల్లీకి వెళ్తున్నారని, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రాపకానికి పొర్లు దండాలు పెడుతున్నారని విమర్శించారు. కరీంనగర్‌లో వర్షాలతో ప్రజలు అవస్థలు పడుతుంటే అవేం పట్టించుకోకుండా ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.

బీసీ హాస్టల్‌లో సీట్ల సంఖ్య పెంచాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 4: బీసీ కళాశాల హాస్టల్‌లో సీట్ల సంఖ్య పెంచాలని కోరుతు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీసీ డిడి అనిల్ ప్రకాష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లాలో చాలా మంది విద్యార్థులు హాస్టల్ వసతి కోసం దరఖాస్తు చేసుకొని సీటు రాక వెనుదిరుగుతున్న పరిస్థితి జిల్లాలో నెలకొందన్నారు. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ ఒక విద్యా కేంద్రంగా మారుతుం దని ప్రతి విద్యార్థికి హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హాస్టల్ వార్డెన్లు మెనూ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మెనూ పాటించిన వార్డెన్లపైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్కావెంజర్ లేక విద్యార్థులే బాత్రూంలో కడుగుతున్న పరిస్థితి జిల్లాలో నెలకొం దన్నారు. విద్యార్థులను బాత్రూంలో కడిగిస్తున్న వార్డెన్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ డిడి అనిల్ ప్రకాష్ మాట్లాడుతూ హాస్టల సమస్యల పైన సానుకూలంగా స్పందిస్తూ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు, మెనూ పాటించని వార్డెన్లను మందలిస్తామని తెలియజేశారు. దానితోపాటు జిల్లాలో డ్రగ్స్ పైన అవగాహన సదస్సులుఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వినయ్ సాగర్, ఇషాక్ జిల్లా కమిటీ సందేశ్‌నాయకులు తరుణ్ , కుమార్‌లు పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని విస్మరించిన ముఖ్యమంత్రి'

గణేశ్‌నగర్, సెప్టెంబరు 4: విద్యారంగాన్ని విస్మరించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని ఏబీవీపీ స్టేట్‌వర్కింగ్ కమిటీ మెంబర్ జెల్లపెల్లి అంజన్న డిమాండ్ చేశారు. ఏబీవీపీ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్స్ దాదాపు 7500 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

చెరువు గండి పూడ్చాలని వినతి

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 4: జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలోని పెద్ద చెరువుకు వేసిన గండి పూడ్చాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకమళ్ల ఆశోక్ బుధవారం తహశీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రం ఆందజేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని లేని ఎడల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు పదోన్నతి

ఇల్లందకుంట, సెప్టెంబరు 4: ఇల్లందకుంట మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వరలక్ష్మి తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. ఇక్కడ గత రెండేళ్లుగా డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వరలక్ష్మికి సిరిసిల్ల జిల్లాకు తహసీల్దార్‌గా పదోన్నతి లభించినట్లు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వరలక్ష్మిని తహసీల్దార్ రాణితో పాటు రెవెన్యూ అధికారులు ఘనంగా సన్మానించారు.

మానేరు తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వీణవంక, సెప్టెంబర్ 4: ఎల్ఎండీ గేట్లు ఎత్తే అవకాశం ఉందని, మండలం లోని మానేరు తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఓ ప్రకటనలో తెలిపారు. మానేరు వైపు పనులు మానుకోవాలని భారీగా వరద వస్తుందని తెలిపారు. అధికారులు ప్రజలను అప్రమత్తం చేసి అందుబాటులో ఉండాలని కోరారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు : సీఐ

తిమ్మాపూర్, సెప్టెంబరు4: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని బాగా చదువుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని తిమ్మాపూర్ సిఐ స్వామి అన్నారు. మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీఐ స్వామి హాజరై పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకునూర్‌లో పోషణ్ అభియాన్

సైదాపూర్, సెప్టెంబరు 4: పోషణ్ అభియాన్ వారోత్సవాలలో భాగంగా సైదాపూర్ మండలంలోని ఆకునూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు రజిత, రమాదేవి, అమరావతి, ఏఎన్ఎమ్, ఆశాలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

ఎల్ఎండీ ఎస్సైగా వివేక్ బాధ్యతల స్వీకరణ

తిమ్మాపూర్, సెప్టెంబరు4: తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి ఎస్సైగా వివేక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎల్ఎండి ఎస్సైగా విధులు నిర్వర్తించిన చేరాలు కరీంనగర్ త్రీటౌన్‌కు బదిలీపై వెళ్లగా, జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించిన వివేక్ ఎల్ఎండి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై రావడం జరిగింది.